9న భారతీయ భాషోత్సవం

రాయదుర్గం: మహాకవి సుబ్రహ్మణ్య భారతి జన్మదినోత్సవాన్ని భారతీయ భాషా దినోత్సవంగా ప్రతియేటా డిసెంబర్ 11న జరుపుకోవాలని భారత ప్రభుత్వం ప్రకటించిందని హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య వి కృష్ణ శనివారం తెలిపారు. హెచ్‌సీయూలో ఈనెల 9వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు.తెలుగు, ఉర్దూ, కన్నడ భాషల నుంచి నిష్ణాతులైన వారిచే ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆంగ్ల నూతన సంవత్సరం 2024 సందర్భంగా హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీహిల్స్ కాలనీ అసోసియేషన్ వారి నూతన కేలండర్‌ను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కేఎస్ఆర్ మూర్తి, సెక్రటరీ గోపిచంద్, ట్రెజరర్ బి. ప్రసాద్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయ జాతర ఏర్పాట్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. శనివారం సోమేశ్వర ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మూడు రోజులపాటు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ



రాయదుర్గం: అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్‌లో శనివారం స్థానిక సాయిదత్త గణపతి ఆలయంలో మొదట అక్షింతలకు పూజ చేశారు. అనంతరం వలంటీర్లు కాషాయ పతాకాలను ధరించి ఇంటింటికి వెళ్లి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. పంపిణీ చేసిన వారిలో స్థానిక నాయకులు రవీందర్‌రెడ్డి, దినేష్‌యాదవ్, సుభాష్ వెంకటేష్, వెంకట్‌రావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

శోభాయాత్ర..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ముంబై కాలనీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం జరిగిన అయోధ్య శ్రీరాముని అక్షింతల వితరణ శోభయాత్రలో కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి పాల్గొన్నారు.అనంతరం ఆలయ నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు.

రేపటి నుంచి 'ప్రజావాణి'

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి ప్రారంభం కానుందని ఉపకమిషనర్ వంశీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు నేరుగా సర్కిల్ కార్యాలయంకు వచ్చి నేరుగా వినతులు అందించవచ్చన్నారు.

గణేష్‌గడ్డ హుండీ లెక్కింపు

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో శనివారం హుండీని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో లెక్కించారు. 56 రోజులకుగానూ రూ. 14 లక్షల 77 వేలు వచ్చాయని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి ,చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గచ్చిబౌలి కార్పొరేటర్



రాయదుర్గం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. శనివారం నగరంలో ఆయన నివాసంలో కలిసి తన పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. గంగాధర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి సీఎం అభినందించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మియాపూర్: మియాపూర్‌లోని మయూరినగర్ కాలనీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

నేడు మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: హస్మత్‌పేటబస్టాప్ సమీపంలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటుందని యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10.30గంటలకు జరిగే స్వామివారి కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతఎముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు.

స్పోర్ట్స్ డే


బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యా భవన్‌లో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్‌డేలో విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న భవన్ కేంద్ర హైదరాబాద్ వైస్ చైర్మన్ గోపాలకృష్ణన్, ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఉమ. – సాక్షి సిటీ బ్యూరో

ముగిసిన ప్రజాపాలన

- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- మూసాపేట సర్కిల్ పరిధిలో 76,115 దరఖాస్తులు


మూసాపేటలోని ప్రజా పాలన కేంద్రంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో ప్రజా పాలన దరఖాస్తులు 14,868 అందాయని అధికారులు వెల్లడించారు. మూసాపేట సర్కిల్ పరిధిలో 76,115 దరఖాస్తులు అందాయి. 8వ రోజుల పాటు మూసాపేట డివిజన్‌లో నాలుగు సెంటర్స్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. మహాలక్ష్మి,గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా పథకాల కొరకు దరఖాస్తులు స్వీకరించారు. మూసాపేటలోని వార్డు కార్యాలయంలో 6706, రాయలసీమ గ్రౌండ్‌లో 1925, పీఆర్‌నగర్‌లో 2827, మోతీనగర్ వార్డు కార్యాలయంలో 3410 దరఖాస్తులు స్వీకరించారు. ఇంకా పథకాలు ఎప్పుడు అందిస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కళకళలాడిన జిరాక్స్ సెంటర్లు..

పథకాల పుణ్యమా అని జిరాక్స్ దుకాణదారులు లబ్ధి పొందారు. దరఖాస్తు ఫారంకు రూ.20, రేషన్ కార్డు ఫారంకు రూ.10 వసూలు చేశారు. ఇంకా ఆధార్ కార్డుల జిరాక్స్ అంటూ 8 రోజుల పాటు ఈ దుకాణాలు కళకళలాడాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వారే మూసాపేటలో అధికంగా ఉండటంతో ఆధార్‌కార్డులో అడ్రస్ మార్పున మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగారు.

◆ **పథకాలు ఎప్పుడు అమలవుతాయోనని ఎదురు చూస్తున్న మూసాపేట వాసులు..**

మూసాపేటలో వలసవచ్చిన పేద ప్రజలు అధికంగా ఉన్నారు. గూడ్స్ షెడ్ రోడ్డులోని హమాలీలు, ప్రశాంత్‌నగర్, బాలానగర్‌లోని చాలా మంది కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. దీంతో మూసాపేట ప్రాంతంలోనే ఎక్కువగా దరఖాస్తులు అందాయి. గత ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో పథకాల కన్నా ఎక్కువగా రేషన్ కార్డు కోసం ప్రజలు ఎదురు చూశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆరు పథకాలు దరఖాస్తు చేసుకోమని చెప్పడంతో పేదల్లో హర్షం వ్యక్తం అయ్యింది. దీంతో వారు ఆరు పథకాలతో పాటు రేషన్‌కార్డుకు సైతం దరఖాస్తు చేసుకోవడం విశేషం. కొందరైతే వినతి పత్రంగా రాసి దరఖాస్తు ఫారాలతో పాటు అధికారులకు అందజేశారు. మరి ప్రభుత్వం కొత్తవారికి రేషన్‌కార్డులు జారీ చేస్తుందో లేదో వేచి చూడాలి.

ప్రజలకు పథకాలు అందేలా కృషి చేస్తాం

టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే. జావిద్ అలీ


ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌కే జావిద్ అలీ

మోతీనగర్: ప్రజాపాలన కేంద్రాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ న్యాయవాది ఎస్‌కే జావిద్ అలీ పేర్కొన్నారు. గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేది వరకు కొనసాగిన ప్రజాపాలన కేంద్రాలతో ప్రజలకు ఎన్నో ఉపయోగకరమైన ఆరు గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించడానికి ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. ముగింపు రోజు శనివారం అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు ప్రతి కార్యకర్త చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. నరసింహ యాదవ్, వెంకట్‌రెడ్డి, ఆనంద్, రాజేంద్రరెడ్డి, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి

ఆల్విన్‌కాలనీ: పేద ప్రజలకు ప్రజా పాలన ఓ వరంలాంటిదని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన సత్యంగౌడ్ అన్నారు. శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందుతాయని అన్నారు. పథకాల కోసం బయటి వ్యక్తుల ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెల్ల శ్రీనివాసరావు, రవి, అరుణ, సౌందర్య, రోజా తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో జరిగింది అభివృద్ధి కాదు భూకబ్జాలు

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్


బాలానగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

బాలానగర్: ప్రజాపాలనకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... ఆరు గ్యారంటీల్లో గృహలక్ష్మికి ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇళ్లు అనేది అందరికి ఒక కల లాంటిదని అన్నారు. గత ప్రభుత్వం ఇళ్లు ఇస్తామని మభ్య పెట్టి ఎన్నికల ముందు కంటి తుడుపు చర్యగా కొందరికే ఇచ్చిందన్నారు. అదే విధంగా ఓట్ల కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అనేకమంది బీఆర్ఎస్ పార్టీ నాయకులకే ఇచ్చారని ఆరోపించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశానని చెబుతున్నారని... అభివృద్ధి ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. చాలా ప్రాంతాల్లో అభివృద్ధి కాదు భూకబ్జాలు జరిగాయని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు పనిచేస్తున్నారో లేదో అర్థం కావటం లేదన్నారు.

100 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు కృషి చేస్తాం

మూసాపేట, జేఎన్‌టీయూ దగ్గర అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. 100 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బస్తీ దవాఖానాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని, విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాలానగర్ మండలంలో డిగ్రీ కాలేజీ, జిల్లా పరిషత్ పాఠశాలను నిర్మిస్తామన్నారు. ప్రజాపాలనలో సుమారు 4 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, తూము వేణు, సునీల్ యాదవ్, సి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ రంగనాయకస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీరంగనాథస్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. ఆదివారం తులసీదళార్చన, కోటి దీపోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 11న కుడారై మహోత్సవం, 14న గోధా రంగనాయకస్వామి కల్యాణం ఉంటుందని తెలిపారు. భరత్‌నగర్‌లోని హరిహర క్షేత్రంలోని రామాలయంలో ఆదివారం లక్ష తులసి అర్చన ఉంటుందన్నారు.

నిత్యం ప్రజల్లో ఉండి సమస్యలను పరిష్కరిస్తా

- దళితబంధు కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: నా ప్రాణం ఉన్నంత వరకు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలను కాపాడుకుంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో డివిజన్‌కు చెందిన అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను రాష్ట్రంలోనే రెండో భారీ మెజార్టీ సభ్యుడిగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అసోసియేషన్ సభ్యులు కూడా తన గెలుపులో కీలకపాత్ర వహించారని ఎప్పటికి రుణపడి ఉంటానన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి.. ప్రజా సమస్యలు తెలుసుకొని.. వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించి.. నేడు అభివృద్ధికి మారుపేరుగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని అన్నారు. ఇక ముందు కూడా అభివృద్ధి ఎజెండాగా ముందుకు వెళ్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తారని కోరుకుంటున్నానని తెలిపారు. చాలా మంది దళితులు ఇప్పటికే దళిత బంధుకు దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం మానవతా దృక్పథంతో దళిత బంధు రద్దు చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


కేపీహెచ్‌బీ డివిజన్‌లో జరిగిన సమావేశంలో డివిజన్ అసోసియేషన్ సభ్యులు

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... వినాయకనగర్‌లో మధుసూదన్ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అయితే మధుసూదన్ లోన్‌యాప్‌లో లోన్లు తీసుకున్నాడు. సకాలంలో తీర్చలేక పోవడంతో అప్పులు బాగా పెరిగిపోయాయి. దీంతో భార్య నగలు కుదువబెట్టి బాకీలు చెల్లించాడు. అయినప్పటికీ ఇంకా కొన్ని అప్పులు మిగిలిపోయాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన మధుసూదన్ శనివారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య చుట్టుపక్కల వారి సహాయంతో పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు


జయభారతి అపార్టుమెంట్ వాసులకు అక్షింతలు అందజేస్తున్న బలరాంరాజు

మూసాపేట: అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో భవ్య రామమందిర ప్రారంభోత్సవం ఈనెల 22న జరగనుంది. ఈ సందర్భంగా అయోధ్య రామయ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. శనివారం కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలో బీజేపీ సీనియర్ నాయకులు బలరాంరాజు సారథ్యంలో ములుగు జయభారతి అపార్టుమెంట్ వాసులకు రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. అదే విధంగా అయోధ్య రామ మందిర చిత్ర పటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, రాజారావు, సుధాకర్‌చారి, కళ్యాణ్, రవికుమార్, గుణవతి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి అనుగ్రహం అందరిపై ఉండాలి


అభయాంజనేయస్వామి భారీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

భాగ్యనగర్‌కాలనీ: శ్రీనివాసకాలనీలోని శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర సహిత అభయాంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో పవనసుత అభయాంజనేయస్వామి 27 అడుగుల విగ్రహాన్ని దామోదర్‌రెడ్డి దంపతులు నిర్మించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి భారీ విగ్రహం ఏర్పాటు చేయటం శుభ సూచకమన్నారు. ఆ స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కేఆర్‌కే రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి


ఫతేనగర్ డివిజన్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని గౌతమ్‌నగర్, నేతాజీనగర్‌లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, ఏఈ పవన్‌తో కలిసి శనివారం పర్యవేక్షించారు. కాలనీల్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం, దోబీ ఘాట్ భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వీరేశం గుప్తా, అశోక్, రజక, ఎట్టయ్య స్వామి, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ.. డ్రైనేజీ

- రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిపోతున్న మురుగు
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు విజ్ఞప్తి




కొత్తూరు సీతయ్యనగర్ నుంచి రాజీవ్‌గాంధీనగర్ వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద పొంగిపొర్లుతున్న మురుగు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కొత్తూరు సీతయ్యనగర్ నుంచి రాజీవ్‌గాంధీనగర్ వెళ్లే ప్రధాన రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద డ్రైనేజీ పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ఈ మార్గం హైటెక్ సిటీకి మార్గమధ్య దారికావటంతో కూకట్‌పల్లి, మూసాపేట నుంచి తరచు నిరంతరం రాత్రి పగలు తేడా లేకుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. అదేవిధంగా బోరబండ నుంచి కూకట్‌పల్లికి వెళ్లే మార్గ మధ్య దారి కావటంతో మోతీనగర్, అల్లాపూర్, శ్రీరామ్‌నగర్, ఎర్రగడ్డతో పాటు పలు ప్రాంతాల వాసులు నిరంతరం రాకపోకలు కొనసాగిస్తుంటారు.


◆ అదే విధంగా పాదచారులు వెళ్లడానికి ఈ మురుగునీటితో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వేబ్రిడ్జి కింద తరచూ డ్రైనేజీతో పాటు మంచినీటి పైపులైన్ లీకేజీ కావటంతో నిరంతరం నీళ్ల నిల్వ ఉండటంతో వాహన చోదకులు ఎక్కడ ఎత్తు పల్లాలు ఉన్నాయో తెలియక తరచు కిందపడి ప్రమాదాలబారిన పడుతున్నారు.

◆ అంతేకాకుండా మురుగునీరు పాదాచారులపై పడటంతో గొడవలు జరుగుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. రాజీవ్‌గాంధీనగర్, సఫ్దార్‌నగర్, యూసుఫ్‌నగర్‌లతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట, కైత్లాపూర్ వంటి ప్రాంతాల నుంచి హైటెక్ సిటీకి వెళ్లడానికి దారి మార్గ మధ్యన ఉండటంతో తరచూ డ్రైనేజీ పొంగిపొర్లి రైల్వే బ్రిడ్జి కింద రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

◆ ఇప్పటికైనా సంబంధిత అధికారులు శాశ్వతంగా చర్యలు చేపట్టాలని ఆయా కాలనీవాసులు, వాహన చోదకులు కోరుతున్నారు. అసలే ఈ రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కు పోవటంతో పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లే వారు వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు.

◆ అదే విధంగా రాత్రి వేళల్లో వాహన చోదకులు, పాదచారులు ఈ బ్రిడ్జి కింద నుంచి వెళ్లాలంటే నరకయాతనను చవిచూస్తున్నారు. ఇటు వైపు వెళ్లకుండా మూసాపేట మీదుగా వెళ్లాలనుకుంటే సమయం బాగా వృథా అవుతోంది. సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవటం కష్టమవుతోంది. అదే విధంగా బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సి వస్తుంది. ఈ సమస్యను అధికారులు దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ నీరు బ్రిడ్జి క్రింద నిల్వకుండా సమస్యను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ఈ సమస్య తలెత్తిన ప్రతిసారి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. నిత్యం మాకు ఇదో నరకం. ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోరు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి.
– నార్లపురం నాగరాజు, యూసుఫ్‌నగర్